ప్రజాపాలనతో ప్రజలు లబ్ధి పొందాలి

- ఆరు గ్యారెంటీల అమలు బాధ్యత ప్రభుత్వానిదే..
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

దరఖాస్తులతో వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 28: ప్రజాపాలనతో ప్రజలు లబ్ధి పొందాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తే స్వాగతిస్తామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయుత పథకాలు అర్హులందరికీ అందాలన్నారు. అర్హులందరూ తప్పకుండా దరఖాస్తు చేయాలని సూచించారు. ఆరు గ్యారెంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని పథకాలు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలని, దరఖాస్తులు నింపడంలో ప్రజలకు సాయం చేయాలని కోరారు. పారదర్శకమైన విధానానికి మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, బీఆర్‌ఎస్‌పట్టణాధ్యక్షుడు అఫ్జల్, నేతలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు

కల్హేర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి

కల్హేర్, డిసెంబర్ 28: పార్టీలకతీతంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందజేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. గురువారం మండలకేంద్రమైన కల్హేర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని గుర్తించి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను ముందుగా నిరుపేద కుటుంబాలకు మంజూరు చేస్తామన్నారు. ఏవైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నర్సింహారావు, తహసీల్దార్ బాలశంకర్, గ్రామ సర్పంచ్ లచ్చవ్వబాలయ్య, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌టౌన్: పట్టణంలోని బేడబుడిగజంగాల కాలనీలో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు

- తొలిరోజు ప్రజాపాలన అంతా అయోమయం
- విధివిధానాలు తెలియక ఇబ్బందిపడ్డ జనం
- ప్రజల సందేహాలు నివృత్తి చేయడంలో అధికారుల విఫలం
- బృందంలోని ఒక్కో అధికారి ఒక్కో తీరుగా సమాధానం
- గ్రామసభల వద్ద సరిపడా లేని దరఖాస్తు ఫారాలు
- అప్‌డేట్స్ కోసం ఆధార్ కేంద్రాల వద్ద బారులు
- ప్రొటోకాల్ పాటించని అధికారులు
- అసహనం వ్యక్తంచేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- గ్రామసభలకు సమయానికి చేరుకోని యంత్రాంగం

అయోమయం..!

సిద్దిపేట, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొత్త ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' ఉమ్మడి మెదక్ జిల్లాలో గురువారం ప్రారంభమైంది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో సెలవు దినాల్లో మినహా జనవరి 6వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తొలిరోజు సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిగతాచోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ప్రారంభించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సందేహాల నివృత్తిలో అధికారులు విఫలం..

ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన అధికారులు సరైన సమాధానాలు చెప్పడంలేదని తొలిరోజు ప్రజలు వాపోయారు. ప్రజాపాలనపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. పైగా ఏదో మీకు నచ్చింది నింపివ్వండి అంటూ అధికారులు ముక్తసరిగా సమాధానాలు చెప్పడంతో మరింత అయోమయానికి గురయ్యారు. ఆయా గ్రామసభల్లో అధికారుల సమన్వయలోపం స్పష్టంగా కనిపించింది. బృందంలోని ఒక్కో అధికారి ఒక్కో సమాధానం చెప్పడంతో ప్రజలకు తిప్పలు తప్పలేదు. గ్రామసభకు ముందే దరఖాస్తు ఫారాన్ని ప్రతి కుటుంబానికి అందజేయాలని ప్రభుత్వం చెప్పింది. కానీ, ఎక్కడా అది అమలు కాలేదు. కుటుంబాల సంఖ్యకు అనుగుణంగా దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచలేదని ప్రజలు మండిపడ్డారు. దరఖాస్తు ఫారాలు పొందిన వారు వాటిని నింపేందుకు చాలా ఇబ్బందులుఎదుర్కొన్నారు. ఒకరు ఒక రకంగా, మరో అధికారి మరోరకంగా నింపాలని సూచించారు. కొందరు లబ్ధిదారులు జిరాక్స్ చేసిన ఫారాలను నింపి ఇవ్వగా మొదట తీసుకుని, తరువాత వచ్చే లబ్ధిదారులకు ఒరిజినల్ ఫారాలు మాత్రమే తీసుకుంటామనడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. 'సరిపడా దరఖాస్తులు లేవు, వచ్చేదాక ఆగండి.. లేదంటే మీరే(లబ్ధిదారులు) కలర్ జిరాక్స్ తీసుకుని దరఖాస్తు ఫారాలు నింపి ఇస్తే మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాం' ..అని కౌంటర్ల వద్ద అధికారులు బాహాటంగానే చెప్పారు.

కౌంటర్లున్నా.. సిబ్బంది కరువు..

గ్రామసభల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ, అది ఆచరణలో అమలలు కాలేదు. కొన్నిచోట్ల పేరుకు కౌంటర్లు ఉన్నా.. అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. మరికొన్నిచోట్ల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ రసీదులు ఇవ్వలేదు అన్న ఫిర్యాదులు వచ్చాయి. రేపు వచ్చి రసీదులు తీసుకోండి అంటూ దాటవేశారని ప్రజలు చెప్పారు. కొన్నిచోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరించి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో కార్యక్రమం అభాసుపాలైంది. వేదికలపై ఎలాంటి పదవులు లేని వారు కూర్చుండి అధికారులతో దీటుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై ప్రజలు మండిపడ్డారు. ఉదయం 8 గంటలకు ప్రారంభించాల్సిన గ్రామసభలు కొన్నిచోట్ల 10 గంటలు దాటినా ప్రారంభం కాలేదు.

కొన్నిచోట్ల ప్రొటోకాల్ రగడ..

మెదక్ జిల్లాలోని నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రొటోకాల్ పాటించలేదని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డిపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అసహనం వ్యక్తంచేశారు. స్థానిక ప్రజాప్రతినిధులను కాకుండా ప్రొటోకాల్ విస్మరించి కాంగ్రెస్ నాయకులతో నిర్వహించడం ఏమిటి అంటూ పలుచోట్ల అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. క్షేత్రస్థాయి అధికారులకు సరైన శిక్షణ, అవగాహన లేకపోవడంతో తొలిరోజు చాలా గ్రామసభల్లో ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు నింపడంలో ప్రజల్లో గందరగోళం నెలకొన్నది.

మొక్కుబడిగా ఫారాల స్వీకరణ..

కార్యక్రమం నిర్వహించామా.. దరఖాస్తులు స్వీకరించామా.. అయి పోయిందా..? అన్నట్లుగా కొనసాగింది. ప్రజలు ఏం అడుగుతున్నారు..? వారికి ఉన్న సందేహాలను ఎలా నివృత్తి చేద్దాం అనే కోణంలో అధికార యంత్రాంగం పనిచేయడం లేదని చెప్పాలి. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరి కావడంతో కొంతమంది ఆధార్ కార్డులు అప్‌డేట్ లేకపోవడంతో ఆధార్ సెంటర్ల వద్ద జనం బారులు తీరారు. ఇదే సమయంలో దరఖాస్తు ఫారాల కోసం జిరాక్స్ సెంటర్లకూ ప్రజలు పరుగులు పెట్టారు. కౌంటర్ల వద్ద ప్రజల సందేహాలు నివృత్తి చేయడానికి ఎవరూ కనిపించలేదు. దీంతో ప్రజలు దరఖాస్తు ఫారాల్లో ఏమి నింపాలి.. ఎలా నింపాలి.. అనే సందేహాలతో ఇబ్బందులు పడ్డారు.

ప్రజాపాలన ఏర్పాట్లలో విఫలం

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 28: హుస్నాబాద్‌లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమ ఏర్పాట్లలో అధికారులు విఫలమయ్యారు. పలు చోట్ల దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలకు కూర్చునేందుకు కుర్చీలు కూడా లేక చాలాసేపు నిలబడే ఉన్నారు. పలు కేంద్రాల్లో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేయలేదు. దరఖాస్తుదారుల అనుమానాలు నివృత్తి చేసేందుకు పలుచోట్ల అధికారులు తెలియదని సమాధానం ఇచ్చారు. కిరాయి ఇంట్లో ఉంటున్న తమకు గృహ విద్యుత్ ఇచ్చేందుకు దరఖాస్తులు ఎలా చేయాలని పలువురు అడిగిన ప్రశ్నలకు తెలియదనే సమాధానం చెప్పారు. ఆధార్, రేషన్‌కార్డులు స్థానికంగా ఉన్నాయని, కాని తమకు గ్రామంలో స్థలం ఉన్నదని, ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నిస్తే సమాధానం రాలేదని పలువురు వాపోయారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకోసం భారీగా దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. పట్టణంలోని కేబీకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తులు నింపే విషయంలో ఇద్దరు మహిళా కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొన్నది.

మధ్యాహ్నానికే అయిపోయిన దరఖాస్తులు

హుస్నాబాద్ పట్టణంలోని 4వ వార్డులో నిర్వహించిన ప్రజా పాలనలో 371 కుటుంబాలకు 300 దరఖాస్తు ఫారాలు మాత్రమే అధికారులు వార్డుకు ఇచ్చారు. ఈ వార్డుల్లో దాదాపు 400కు పైగా కుటుంబాలు ఉన్నప్పటికీ దరఖాస్తులు తక్కువగా ఇవ్వడంతో ఒంటిగంట వరకే కార్యక్రమం ముగించారు.

మూడుమాట్ల వెనక్కి పంపిండ్రు



మాకు ఇల్లు, పింఛన్ కావాలని అడిగితే సరిగా చెప్తలేరు. మూడు మాట్ల ఆఫీసుకాడికి వచ్చిన. ఈ జిరాక్స్ తేలేదని, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు జిరాక్స్ కావాలని చెప్తుండ్రు. మూడుమాట్ల వెనక్కి పంపిండ్రు. ఇబ్బంది అయితాంది.

- జక్కనిపెల్లి భూలక్ష్మి, హుస్నాబాద్

హుస్నాబాద్‌లో చంటిపిల్లలతో కలిసి వచ్చి దరఖాస్తులు నింపుతున్న యువతులు

అద్దె ఇంటికి గృహజ్యోతి ఇవ్వాలి

నేను డ్రైవర్‌గా పనిచేస్తున్నా. కిరాయి ఇంట్లో ఉంటున్నా. నాకు నెలకు రూ.400 దాక కరెంట్ బిల్లు వస్తున్నది. ఆ బిల్లు మాఫీ కోసం అడిగితే అలాంటి దరఖాస్తు ఏదీ లేదని చెబుతున్నరు. మాలాంటోళ్లు కరెంట్ బిల్లు మాఫీ కోసం ఏం చేయాలో తెలుస్తలేదు. దరఖాస్తు అడిగితే పెద్దసారును అడిగి తీసుకుంటానంటున్నరు.

- బానోతు రాజు, డ్రైవర్, హుస్నాబాద్

ఆరు గ్యారెంటీల అమలుకే ప్రజాపాలన

- 6వ తేదీ వరకు అంతటా దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాపాలన ప్రారంభ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ
- ప్రజాపాలనలో ప్రొటోకాల్ రగడ, ఫ్లెక్సీలపై కనిపించని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఫొటోలు

సంగారెడ్డి పట్టణంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలు కోసమే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించిందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని 3వ వార్డు, చౌటకూరు మండలంలోని శివ్వంపేట, అందోలు మండలంలోని అల్మాయిపేట, సంగుపేట గ్రామాల్లో మంత్రి ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారందరికీ ఆరు గ్యారెంటీలను వర్తింపజేస్తామని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని 647 పంచాయతీలు, ఎనిమిది మున్సిపాలిటీల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా 99 అధికారుల బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆ తర్వాత కూడా పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. కలెక్టర్ శరత్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా అంతటా ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ రెండు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని, దరఖాస్తు సమర్పించిన వారికి రసీదు ఇస్తామని తెలిపారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ రూపేశ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, మెప్మా పీడీ గీత, అధికారులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ అమలుపై రగడ

ప్రభుత్వం ప్రొటోకాల్ అమలు చేయటంలేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గురువారం ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎక్కడా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఫొటోలను ముద్రించలేదు. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజాపాలన ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల్లో ఎక్కడా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మహిపాల్‌రెడ్డి ఫొటోలను ముద్రించ లేదు.

పథకాలు ప్రజలకు చేరాలి

టేక్మాల్, డిసెంబర్ 28 : పథకాలు ప్రజలకు చేరువయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం మండలంలోని చల్లపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించి, మెదక్ కలెక్టర్ రాజర్షి షాతో కలిసి బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన మూడు కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి చందూనాయక్, డీపీవో సాయిబాబా, జడ్పీటీసీ సర్వని సరోజా, వైస్ ఎంపీపీ మంజులా గౌడ్, ఎంపీటీసీ రాధాబాయ్, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధి చల్లపల్లిలో కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ కలెక్టర్ రాజర్షిషా

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అమలుచేయాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్‌లోని మాణిక్ ప్రభు విధిలో ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 28 : ప్రభుత్వం అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులు ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు దరఖాస్తు సమర్పించే సమయంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు జాతచేయాలన్నారు. దరఖాస్తు చేసిన వారు తప్పకుండా రసీదులు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ మండలంలోని చెరాగ్‌పల్లి, కొత్తూర్(బి) గ్రామాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, జహీరాబాద్ ఆర్డీవో వెంకారెడ్డి, మండల ప్రత్యేక అధికారి వసంతకుమారి, ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో సుమతి, ఎంపీవో మహేశ్వర్‌రావు, వివిధ పార్టీల నాయకులు, మొగుడంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సీతారామరాజు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

మానేపల్లిలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, డిసెంబర్ 28. ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారెంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మానేపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై ఏర్పాట్లను పరిశీలించి, వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వృద్ధులు, నిరక్షరాస్యులు ఉంటారని, అలాంటి వారికి అవగాహన కల్పించి, దరఖాస్తులో వివరాలు నమోదు చేయాలన్నారు. చాలామందికి రేషన్ కార్డులు లేవని, ముందుగా వారి నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకోవాలని, మార్పులు, చేర్పుల కోసం కూడా దరఖాస్తులు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ స్వరూప, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, సర్పంచ్ వెంకటలక్ష్మి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ తులసీరాం, ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, జిల్లా కో-ఆప్షన్ మన్సూర్, నాయకులు సోమప్ప, స్వామి, రాజు, ప్రభు, మోహన్‌రెడ్డి, నర్సింహులు, కిష్టాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డిసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించరా..?

ప్రభుత్వం చేపట్టే అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని మండలంలోని మానేపల్లి, అందుగులపల్లి, హస్తాల్‌పూర్, నెల్లూర్ గ్రామాల్లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తాను వస్తున్నానని తెలిసినా పట్టించుకోకుండా ప్రొటోకాల్‌ను మరిచి మానేపల్లిలో కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తారని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, వెల్దుర్తి తహసీల్దార్ తులసీరాంపై మండిపడ్డారు. మొదటి రోజు సమావేశం ఏర్పాటు చేసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వినిపించి, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమం గురించి ప్రజలకు వివరించాల్సి ఉన్నప్పటికీ అలాంటిదేమీ లేకుండా తమ ఇష్టానుసారంగా కార్యక్రమాన్ని నిర్వహించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలు వేరైనా ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అందరూ భాగస్వాములేనని, అందరు కలిసి ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.